# యోహాను సువార్త  5వ అధ్యాయము

### బేతస్థ కోనేటి వద్ద వ్యాధిగ్రస్థుని స్వస్థపరచుట

అటుతరువాత యూదుల పండుగ యొకటి వచ్చెను గనుక యేసు యెరూషలేము నకు వెళ్లెను. 2
యెరూషలేములో గొఱ్ఱల ద్వారము దగ్గర, హెబ్రీ బాషలో బేతెస్థ అనబడిన యొక కోనేరు కలదు, దానికి
అయిదు మంటపములు కలవు. 3 ఆయా సమయములకు దేవదూత కోనేటిలో దిగి నీళ్లు కదలించుట కలదు.
నీరు కదలింపబడిన పిమ్మట, మొదట ఎవడు దిగునో వాడు ఎట్టి వ్యాధిగలవాడైనను బాగుపడును, 4 గనుక
ఆ మంటపములలో రోగులు, గ్రుడ్డివారు, కుంటివారు, ఊచకాలుచేతులు గలవారు, గుంపులుగా
పడియుండిరి. 5 అక్కడ ముప్పది యెనిమిది ఏండ్లనుండి వ్యాధిగల యొక మనుష్యుడుండెను. 6 యేసు,
వాడు పడియుండుట చూచి, వాడప్పటికి బహుకాలము నుండి ఆ స్థితిలోనున్నాడని యెరిగి – "స్వస్థపడ
గోరుచున్నావా?" అని వాని నడుగగా, 7 ఆ రోగి – అయ్యా, నీళ్లు కదలింపబడినప్పుడు నన్ను కోనేటిలోనికి
దించుటకు నాకు ఎవడును లేడు గనుక నేను వచ్చునంతలో మరియొకడు నా కంటె ముందుగా దిగునని
ఆయనకు ఉత్తరమిచ్చెను. 8 యేసు – నీవు లేచి నీ పరుపెత్తికొని నడువుమని వానితో చెప్పగా, 9 వెంటనే
వాడు స్వస్థతనొంది తన పరుపెత్తికొని నడచెను. 10 ఆ దినము విశ్రాంతి దినము గనుక యూదులు – ఇది
విశ్రాంతిదినము గదా నీవు నీ పరుపెత్తికొన తగదే అని స్వస్థత నొందిన వానితో చెప్పిరి. 11 అందుకు వాడు
– నన్ను స్వస్థపరచినవాడు – నీ పరుపెత్తికొని నడువుమని నాతో చెప్పెననెను. 12 వారు – నీ పరుపెత్తికొని
నడువుమని నీతో చెప్పినవాడెవడని వానిని అడిగిరి. 13 ఆయన ఎవడో స్వస్థత నొందినవానికి తెలియలేదు
ఆ చోటను గుంపుకూడియుండెను గనుక యేసు తప్పించుకొనిపోయెను. 14 అటు తరువాత యేసు
దేవాలయములో వానిని "చూచి ఇదిగో స్వస్థత నొందితివి మరి ఎక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇకను
పాపము చేయకుము" అని చెప్పగా. 15 వాడు వెళ్లి, తన్ను స్వస్థపరచినవాడు యేసు అని యూదులకు
తెలియజెప్పెను. 16 ఈ కార్యములను విశ్రాంతి దినమున చేసినందున యూదులు యేసును హింసించిరి.

### కుమారుని ద్వారా జీవము

17 అయితే యేసు – "నా తండ్రి ఇదివరకు పని చేయుచున్నాడు, నేనును చేయు చున్నాను" అని
వారికి ఉత్తరమిచ్చెను. 18 ఆయన విశ్రాంతి దినాచారము మీరుట మాత్రమే గాక, దేవుడు తన సొంత తండ్రి
అని చెప్పి, తన్ను దేవునితో సమానునిగా చేసికొనెను గనుక ఇందు నిమిత్తమును యూదులు ఆయనను
చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి. 19 కాబట్టి యేసు వారికి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను – "తండ్రి
ఏది చేయుట కుమారుడు చూచునో, అదే కాని తనంతట తాను ఏదియు చేయనేరడు ఆయన వేటిని
చేయునో, వాటినే కుమారుడును అలాగే చేయును. 20 తండ్రి కుమారుని ప్రేమించుచు, తాను
చేయువాటినెల్లను ఆయనకు అగపరచుచున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. మరియు మీరు
ఆశ్చర్యపడునట్లు వీటి కంటె గొప్ప కార్యములను ఆయనకు అగపరచును. 21 తండ్రి మృతులను ఏలాగు
లేపి బ్రతికించునో అలాగే కుమారుడును తన కిష్టము వచ్చిన వారిని బ్రతికించును. 22 తండ్రి యెవనికిని తీర్పు
తీర్చడు గాని 23 తండ్రిని ఘనపరచునట్లుగా అందరును కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు
సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు కుమారుని ఘనపరచని వాడు ఆయనను పంపిన తండ్రిని

ఘనపరచడు. 24 నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. 25 మృతులు దేవుని కుమారుని శబ్దము విను గడియ వచ్చుచున్నది, ఇప్పుడే వచ్చియున్నది దానిని వినువారు జీవింతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. 26 తండ్రి ఏలాగు తనంతట తానే జీవము గలవాడై యున్నాడో అలాగే కుమారుడును తనంతట తానే జీవము గలవాడై యుండుటకు కుమారునికి అధికారము అనుగ్రహించెను. 27 మరియు ఆయన మనుష్య కుమారుడు గనుక తీర్పు తీర్చుటకు తండ్రి అధికారము అనుగ్రహించెను. 28 దీనికి ఆశ్చర్యపడకుడి ఒక కాలము వచ్చుచున్నది ఆ కాలములో సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని, 29 మేలు చేసినవారు జీవపునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు. 30 నా అంతట నేనే ఏమియు చేయలేను నేను వినునట్లుగా తీర్పు తీర్చుచున్నాను నన్ను పంపిన వాని చిత్తప్రకారమే చేయగోరుదును గాని, నా యిష్ట ప్రకారము చేయగోరను గనుక నా తీర్పు న్యాయమైనది.

## యేసుని గూర్చి సాక్ష్యము

31 నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనిన యెడల నా సాక్ష్యము సత్యము కాదు. 32 నన్ను గూర్చి సాక్ష్యమిచ్చు వేరొకడు కలడు ఆయన నన్ను గూర్చి ఇచ్చు సాక్ష్యము సత్యమని యెరుగుదును. 33 మీరు యోహాను నొద్దకు కొందరిని పంపితిరి అతడు సత్యమునకు సాక్ష్యమిచ్చెను. 34 నేను మనుష్యుల వలన సాక్ష్యమంగీకరింపను గాని మీరు రక్షింపబడవలెనని ఈ మాటలు చెప్పుచున్నాను. 35 అతడు మండుచు ప్రకాశించుచున్న దీపమైయుండెను మీరతని వెలుగులో వుండి కొంత కాలము ఆనందించుటకు ఇష్టపడితిరి. 36 అయితే యోహాను సాక్ష్యముకంటే నాకెక్కువైన సాక్ష్యము కలదు అదేమనిన, నేను నెరవేర్చుటకై తండ్రి క్రియలను నాకిచ్చియున్నాడో, నేను చేయుచున్న ఆ క్రియలే తండ్రి నన్ను పంపియున్నాడని నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి. 37 మరియు నన్ను పంపిన నా తండ్రియే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాడు. మీరు ఏ కాలమందైనను ఆయన స్వరము వినలేదు ఆయన స్వరూపము చూడలేదు. 38 ఆయన ఎవరిని పంపెనో ఆయనను మీరు నమ్మలేదు గనుక మీలో ఆయన వాక్యము నిలిచియుండలేదు. 39 లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు, అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి. 40 అయితే మీకు జీవము కలుగునట్లు మీరు నా యొద్దకు రానొల్లరు. 41 నేను మనుష్యుల వలన మహిమ పొందువాడను కాను. 42 నేను మిమ్మును ఎరుగుదును దేవుని ప్రేమ మీలో లేదు. 43 నేను నా తండ్రి నామమున వచ్చి యున్నాను మీరు నన్ను అంగీకరింపరు మరియొకడు తన నామమున వచ్చిన యెడల వానిని అంగీకరింతురు, 44 అద్వితీయ దేవుని వలన వచ్చు మెప్పును కోరక, యొకని వలన ఒకడు మెప్పుపొందుచున్న మీరు ఏలాగు నమ్మగలరు ? నేను తండ్రియొద్ద మీ మీద నేరము మోపుదునని తలంచకుడి 45 మీరాశ్రయించుచున్న మోషే మీ మీద నేరము మోపును. 46 అతడు నన్ను గూర్చి వ్రాసెను గనుక మీరు మోషేను నమ్మినట్టయిన నన్నును నమ్ముదురు. 47 మీరతని లేఖనములను నమ్మనియెడల నా మాటలు ఏలాగు నమ్ముదురు" అనెను.